

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :

janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 2 | సంచిక : 275 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 12-06-2024 | పేజీలు : 4


## అమరావతే రాజధాని.. ఆర్థిక రాజధానిగా విశాఖ

**టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు**

**విజయవాడ, జూన్ 11 (జనస్వరం) :** రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజలు ఇచ్చారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. తెదేపా-జనసేన-భాజపా కూటమి శాసనసభా పక్ష భేటీ విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. "ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. నూటికి నూరు శాతం 3 పార్టీల నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారు. ఎన్నికల్లో 93 శాతం సీట్లు గెలవడం దేశ చరిత్రలో అరుదు. ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో ప్రజలు ఆశీర్వదించారు. ప్రజల తీర్పుతో మనందరిలో మరింత బాధ్యత పెరిగింది" "జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ గెలుపొందింది. భాజపా పోటీ చేసిన 10 స్థానాల్లో 8 సీట్లు గెలుచుకుంది. ప్రజలు ఇచ్చిన తీర్పు వల్ల దిల్లీలో అందరూ గౌరవించారు. ప్రజల తీర్పుతో రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగింది. పవన్ కల్యాణ్ సమయస్ఫూర్తిని ఎప్పటికీ మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు ఆయన వచ్చి పరామర్శించారు. తెదేపా, జనసేన పొత్తు పెట్టుకుంటున్నట్లు చెప్పారు. భాజపా, తెదేపా జనసేన కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పొత్తు పెట్టుకున్నాం. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా కలిసి పనిచేశాం"

**రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం**

మీ అందరి సహకారంతో బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నా. కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఎన్డీయే నేతలు హాజరవుతున్నారు. సమష్టిగా ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం. రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తామని కేంద్ర నేతలు చెప్పారు"

**నా కుటుంబానికి అవమానం జరిగింది..**



ఓటర్లు ఇచ్చిన తీర్పు రాష్ట్ర చరిత్రలో నిలుస్తుంది. పదవి వచ్చిందని విర్రవీగితే ఇదే పరిస్థితి వస్తుంది. తప్పు చేసిన వారిని క్షమిస్తే అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. విధ్వంస, కక్షా రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. నా కుటుంబానికి అవమానం జరిగింది. గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని చెప్పి బయటకు వచ్చా. ప్రజాక్షేత్రంలో గెలిచి గౌరవ సభగా చేసి అడుగుపెడతానని చెప్పా. నా శపథాన్ని ప్రజలు గౌరవించారు. గౌరవించిన ప్రజలను నిలబెట్టాలి. పోలవరం పనులు 72 శాతం పూర్తి చేశాం. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. నదులను అనుసంధానించి ప్రతి ఎకరానికి నీళ్లందిస్తాం"

**రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది..**

"14 ఏళ్లుగా సీఎంగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ముందుకెళ్లాం. ఏపీలో చాలా సమస్యలు ఉన్నాయి. రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది. సంక్షోభంలో ఉంది. అన్ని వర్గాలు దెబ్బతిన్నాయి. రైతులు అప్పులపాలయ్యారు. పదేళ్ల తర్వాత రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితి. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మకంగా ముందుకు వెళ్లాలి. మూడు రాజధానులంటూ ఆటలాడే పరిస్థితి ఉండదు. అమరావతి రాజధానిగా ఉంటుంది. విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా చేసుకుందాం"

**ఆ హోదా సేవ కోసమే..**

"సీఎం పర్యటనల సందర్భంగా షాపులు బంద్ చేయడం, రోడ్లు మూసేయడం, పరదాలు కట్టుకోవడం అవన్నీ ఉండవు. సీఎం కూడా మామూలు మనిషే. మామూలు మనిషిగానే వస్తా. మిత్రుడు పవన్‌తో పాటు మేమంతా సామాన్య వ్యక్తులుగానే మీ వద్దకు వస్తాం. మీలో ఒకరిగా ఉంటాం. హోదా సేవ కోసమే తప్ప.. పెత్తనం కోసం కాదు. కాన్వాయ్ వచ్చే సమయంలో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దని చెప్పాం. ఒక సిగ్నల్‌కి మరో సిగ్నల్‌కి గ్యాప్ పెట్టుకోండి. ఐదు నిమిషాలు లేట్ అయినా పర్వాలేదు కానీ.. ప్రజలకు అసౌకర్యం కలగకూడదని స్పష్టంగా ఆదేశించాం. దాడులు చేసి బాధితులపైనే కేసులు పెట్టే పరిస్థితి ఉండదు. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికీ భంగం కలగదు. ప్రజాహితం కోసమే పనిచేస్తాం. ప్రతి నిర్ణయం, ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుంది. 'స్టేట్ ఫస్ట్' అనే నినాదంతో ముందుకెళ్తాం.

**కేంద్రమంత్రివర్గంలో రాష్ట్రానికి సముచిత గౌరవం**

కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి సముచిత గౌరవం దక్కింది. ముగ్గురు ఎంపీలు కేంద్రంలో మంత్రులుగా ఉండే అవకాశం వచ్చింది. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మకు క్యాబినెట్‌లో చోటు కల్పించారు. సాధారణ వ్యక్తిగా ఉన్న శ్రీనివాస వర్మకు భాజపా ఎంపీ టికెట్ ఇచ్చినపుడే ఆశ్చర్యం కలిగింది. ఆ తర్వాత ఆరా తీస్తే పార్టీ కోసం చాలా కష్టపడ్డాడని తెలిసింది. సామాన్య కార్యకర్తను గుర్తించిన పార్టీ భాజపా. తెదేపా, జనసేన కూడా అలా చేస్తున్నాయి. పదేళ్ల మోదీ పరిపాలన దేశప్రతిష్ఠను పెంచింది. ప్రపంచంలో భారతీయులకు గుర్తింపు తీసుకొచ్చింది. మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగబోతోంది. ఆయన కల వికసిత్ భారత్- 2047. మనది వికసిత్ ఆంధ్రప్రదేశ్.. ఈ లక్ష్యంతో ముందుకెళ్లాలి" అని చంద్రబాబు అన్నారు.

## సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళదాం

**జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్**



**విజయవాడ, జూన్ 11 (జనస్వరం) :** గత ఐదేళ్లుగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు. "తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని ఇప్పటం సభలో చెప్పాం.. అదే మాటపై నిలబడ్డాం. ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నాం. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదు. మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన నలిగిపోయారు. జైల్లో చూశాను. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధను చూశాను. మంచిరోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. ఆ రోజులు వచ్చాయి. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.

కూటమి లక్ష్యం ప్రజా సంక్షేమం: పురందేశ్వరి

ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించేందుకు ప్రజలు కసిగా ఓట్లు వేశారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన ప్రతిపాదనను తాను సమర్థిస్తున్నట్లు తెలిపారు. విజయం నుంచి పాఠాలు కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి లక్ష్యం ప్రజా సంక్షేమనని, మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమం వంటిదని వ్యాఖ్యానించారు.

## నేడే ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం

**విజయవాడ, జూన్ 11 (జనస్వరం) :** ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయాన్ని సాధించాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఏపీ సీఎంగా నాలుగోసారి చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఈ సందర్భంగా విజయవాడ - గన్నవరం మధ్య పోలీసుల బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

**గన్నవరం ఎయిర్‌పోర్టు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**




సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమం నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బుధవారం విమాన ప్రయాణికులు ఉదయం 9.30 గంటల్లోపే చేరుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత రెడ్డి సూచించారు. ప్రయాణికుల విమానాలేవీ రద్దు చేయలేదని.. అన్నీ యథాతథంగా నడుస్తాయని తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, షిర్డీ వెళ్లే విమానాలు యథావిధిగా బయల్దేరతాయని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విమానాశ్రయ పరిసరాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. బుధవారం ఉదయం 11.27 నిమిషాలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. కూటమిలోని తెదేపా, భాజపా, జనసేన పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

**చంద్రబాబు ప్రమాణస్వీకారానికి రాష్ట్ర విశిష్ట అతిథిగా చిరంజీవి**



ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అగ్రకథానాయకుడు చిరంజీవి హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశిష్ట అతిథిగా హాజరుకావాలని కోరుతూ చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం అందింది. రామ్ చరణ్ కూడా హాజరుకానున్నారు. మరోవైపు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం 11.27 నిమిషాలకు సీఎంగా బాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ జనసేనకు చిరంజీవి రూ.5 కోట్ల విరాళం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కూటమి సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు పెట్టారు. పవన్ కల్యాణ్ కూడా ఎన్నికల ఫలితాల అనంతరం చిరంజీవి నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు.

**7వేల మంది పోలీసులతో బందోబస్తు**



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టబోతున్న తెదేపా అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. కేసరపల్లిలోని ఐటీటవర్ వద్ద బుధవారం ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానితో పాటు పలువురు ప్రముఖులు విచ్చేస్తుండటంతో దాదాపు ఏడు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు. పాస్‌లు ఉన్న వారి వాహనాలనే సభా ప్రాంగణం వైపు వెళ్లేందుకు అనుమతిస్తామని పోలీసులు చెబుతున్నారు. నగరంలో వీఐపీలు బసచేసే హోటల్స్ వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ జిల్లా సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తెలుగుదేశం, భాజపా, జనసేన నాయకులు.. కార్యకర్తలు విజయవాడ చేరుకుంటున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు రాత్రికే విజయవాడ చేరుకోనున్నారు.

**ఏపీ మంత్రుల జాబితా విడుదల..**

**చోటు దక్కించుకున్న సభ్యులు వీరే..**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రభుత్వంలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టనున్న వారి జాబితాను మంగళవారం అర్ధరాత్రి దాటాక విడుదల చేశారు. మొత్తం 24 మందికి ఈ జాబితాలో చోటు దక్కింది. జనసేన నుంచి ముగ్గురికి, భాజపా నుంచి ఒకరికి మంత్రి పదవి లభించింది. చంద్రబాబుతో పాటు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జనసేన అధిపతి పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు మంత్రివర్గంలో చోటు లభించింది.

కొత్త మంత్రులు వీరే..

పవన్ కల్యాణ్, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పి. నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, ఎన్.ఎమ్.డి ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 12 జూన్ 2024,**

**తిథి : శుద్ధ షష్ఠి (రా.07:19వ.కు)**

**నక్షత్రం : మఖ (పూర్తి వ.కు), మఖ (13తా తె.02:12వ.కు)**

**బ్రహ్మముహూర్తం : తె.03:49 నుండి తె.04:37 వరకు,**

**రాహుకాలం : ఉ.11:57ల నుండి మ.01:35,**

**యమగండం : ఉ.07:03ల నుండి ఉ.08:41,**

**వర్జ్యకాలం : మ.12:54ల మ.02:53**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 12 జూన్ 2024**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:20**

**సూర్యోదయం : ఉదయం గం. 05:41**

**జొహర్ : మధ్యాహ్నం గం. 12:17**

**అసర్ : సాయంత్రం గం. 03:40**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:51**

**ఇష : రాత్రి గం. 08:13**





జనస్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్

జనస్వరం మీడియా

## ఎడిటోరియల్

# కోటి కష్టాల్లో... కొత్త జిల్లాలు!

**- కార్యాలయాలు కూడా కరవే**

**- 22 నెలలైనా పొరుగు పంచలే గతి**

**- జిల్లాలు ప్రకటించి చేతులు దులుపుకున్న ప్రభుత్వం**

**- అటు ప్రజలు, ఇటు అధికారులు అతలాకుతలం**



'అరచేతిలో తేనె చూపించి... మోచేతులు నాకించే' వైఖరికి నిలువెత్తు నిదర్శనం వైసీపీ ప్రభుత్వమే. అందుకు రాష్ట్రంలో హడావుడిగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలే సాక్ష్యం. మాటలతో మాయ చేసి చేతల్లో చేతులెత్తేసే ముఖ్యమంత్రి జగన్ ఉదాసీన వైఖరి గురించి తెలియాలంటే కొత్త జిల్లాల్లో ప్రస్తుత దుస్థితిని కళ్లారా వీక్షించాల్సిందే.

"కొత్త జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా చూస్తాం. పదికాలాల పాటు గుర్తుండిపోయేలా సమీకృత కార్యాలయాలను నిర్మిస్తాం. కలెక్టర్, ఎస్పీ ఆఫీసులు, వారి క్యాంపు ఆఫీసులు కూడా అక్కడే ఉండేలా చేస్తాం" అంటూ జగన్ గొప్పగా ప్రకటించి ఇప్పటికి 22 నెలలైంది. కనీసం ఒక్క జిల్లాలో కూడా కార్యాలయాల ఏర్పాటు జరగలేదు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల్లో సమీకృత భవనాలు ఆధునిక వసతులతో ఆకట్టుకుంటుండగా, ఏపీలో మాత్రం కొత్త జిల్లాల కార్యాలయాలు అద్దె భవనాల్లో, ఆసుపత్రులు, ఫంక్షన్ హాళ్లలాంటి తాత్కాలిక ప్రాంతాల్లో కొనసాగుతుండడం సిగ్గుచేటుగా మారింది. అయినా జగన్ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. తెలంగాణలో కొత్త జిల్లాల్లో భవనాల ఏర్పాటుకు అక్కడి ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, ఏపీలో మాత్రం జిల్లాకు రెండు కోట్ల రూపాయలు కేటాయించి చేతులు దులుపుకోవడం చూస్తే... జగన్ చెప్పేవన్నీ డొల్ల మాటలు, కల్ల కబుర్లేనని ఇట్టే అర్థమవుతోంది.

**ప్రకటించారు.. పరాకు చూపారు**

రాష్ట్రంలో 2022 ఏప్రిల్ 4 నుంచి 13 కొత్త జిల్లాలు అమలులోకి వచ్చాయి. వీటి ఏర్పాటు జరిగి ఇప్పటికి 22 నెలలవుతోంది. జగన్ చెప్పినట్టు వీటిలో ఒక్క దానిలో కూడా సమీకృత కార్యాలయాల ఏర్పాటు జరగలేదు. కనీసం నిర్మాణ కార్యకలాపాలు సైతం మొదలవలేదు. కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు కనీసం మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అనే పరిశీలన కూడా జరగలేదు. జిల్లాలు ఏర్పాటు చేశాక అధికారులు పని చేయడానికి తగిన వసతులు కల్పించాలనే స్పృహ కూడా లేదు. ఎవరో తరుముకు వస్తున్నట్టు హడావుడిగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి జగన్ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. తర్వాత రెండేళ్లు కావస్తున్నా వసతుల ఏర్పాటుపై కనీస చర్యలు సైతం తీసుకోలేదు. కొన్నింటికి సొంత భవనాలు లేవు. ఇప్పటికీ చాలా చోట్ల కలెక్టర్, ఎస్పీ సహా వివిధ ప్రభుత్వ విభాగాల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరికొన్ని కార్యాలయాలు ప్రైవేటు కళాశాలలు, విద్యాసంస్థల భవనాలు, డివిజన్, మండల స్థాయి కార్యాలయాల్లో సర్దుకుపోవాలసిన దుస్థితి కనిపిస్తోంది. ఇక అధికార సిబ్బంది విభజన సైతం పూర్తి స్థాయిలో జరగలేదు. దాంతో ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు పాత జిల్లా కేంద్రాల్లోనే జరుగుతున్నాయి. చాలా చోట్ల కనీస సదుపాయాలు లేవు. కొన్నయితే జిల్లా కేంద్రాలకు చాలా దూరంగా ఉండడంతో ప్రజల, అధికారుల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉంది. చాలా చోట్ల సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో వ్యయప్రయాసలు తప్పడం లేదు. తెలంగాణ మాదిరిగా ఇక్కడి 30 జిల్లాల్లోనూ సమీకృత భవన సముదాయాలను ఏర్పాటు చేయలేకపోయినా, పరిపాలన సజావుగా సాగడానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి వీలుగా సాధారణ భవనాలు నిర్మించినా సరిపోతుంది. అయితే జగన్ ప్రభుత్వానికి ఆ స్పృహ కూడా కరవైంది.

**ఒకో చోట ఒకో కష్టం...**

– అన్నమయ్య జిల్లాలో కలెక్టర్, ఎస్సీ ఆఫీసులకు సొంత భవనాలు లేవు. కలెక్టరేట్‌ని గిరిజన సంక్షేమ శాఖ బాలుర రెసిడెన్షియల్ స్కూల్లో నడపాల్సి వస్తోంది. ఎస్పీ ఆఫీసును పాలిటెక్నిక్ కాలేజీలో పెట్టారు. జిల్లా కేంద్రానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో పది శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేశారు.

– పల్నాడు జిల్లా కలెక్టరేట్‌ను నరసరావుపేట శివారు లింగంగుట్ల కాలనీలోని నాగార్జున సాగర్ ఎస్సీ ఆఫీసులో ఏర్పాటు చేశారు. అనుబంధ విభాగాలను ఇరుకైన గదుల్లో అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు. పెదచెరువులోని పంచాయితీ రాజ్ శాఖ అతిథి గృహాన్ని కలెక్టర్ నివాస భవనంగా, దాని వెనకున్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని క్యాంపు కార్యాలయంగా వాడుతున్నారు. వాటి ఆధునీకరణను సైతం విరాళాలతో చేయడం గమనార్హం.

– జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రభుత్వాసుపత్రికి చెందిన పౌష్టికాహార కేంద్రంలో పెట్టారు. దీంతో ఆసుపత్రి విస్తరణ పనులు సైతం ఆగిపోయాయి.

– పోలీసు శాఖకు చెందిన ఇతర ఆఫీసులను క్వార్టర్స్‌లో ఏర్పాటు చేశారు. వర్షాలకు అవి కారుతుండడంతో ప్రజల చందాలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు.

– పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌ను ఐటీడీఏ ఆఫీసులోను, ఎస్పీ ఆఫీసును గిరిజన యువత శిక్షణ భవనంలోను పెట్టారు. పలు విభాగాల ఆఫీసులను మూతబడిన మిషనరీ పాఠశాల భవనంలో నడుపుతున్నారు. ఇక్కడ ఫర్నిచర్ సైతం లేక పిల్లల బల్లలనే వాడుకోవడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న నర్సిపురంలోని గ్రామ సెక్రటరీ భవనంలోని ఇరుకు గదుల్లో పెట్టారు.

– పాడేరు ఎస్పీ ఆఫీసును ఓ ఫంక్షన్ హాలులో పెట్టారు. దానికి నెలకు రెండు లక్షల రూపాలయలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. ఐటీడీఏ భవనాలను వేర్వేరు విభాగాల ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించారు. కలెక్టరేట్‌ను రెండు కిలోమీటర్ల దూరంలోని యువజన శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేశారు. మొత్తం 8 ప్రభుత్వ విభాగాలు డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్నాయి.

– తిరుపతి కలెక్టరేట్‌ను తిరుచానూరు తితిదే వసతి గృహంలో నడుపుతున్నారు.

– శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఏ కార్యాలయం ఎక్కడుందో తెలియని పరిస్థితి ఉంది. వీటిని సత్యసాయి ట్రస్టు భవనాల్లోనే ఏర్పాటు చేశారు. ఇరుకు, రవాణా ఇబ్బందులతో అందరూ సతమతమవుతున్నారు.

– కోనసీమ జిల్లా కలెక్టరేట్‌ను అమలాపురంలోని డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అక్కడికి 16 కిలోమీటర్ల దూరంలోని ముమ్మిడివరంలోని ఇంజినీరింగ్ కళాశాల భవనాల్లో 24 ప్రభుత్వ విభాగాల ఆఫీసులను పెట్టారు. దీనికి నెలవారీ అద్దె రూ. 12 లక్షలు.

– చాలా విభాగాల్లో స్టేషనరీలాంటి అవసరాలకు సైతం నిధుల కొరత ఉందంటే ప్రభుత్వ ఉదాసీనత ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

– తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌ను రాజమహేంద్రవరం శివారు బొమ్మూరు దగ్గరి న్యాక్ భవన సముదాయంలో పెట్టారు. సమీపంలోని యువజన శిక్షణ కేంద్రంలో 14 ప్రభుత్వ శాఖల ఆఫీసులు నడుపుతున్నారు. డీఆర్‌డీఏ కార్యాలయం హుకుంపేటలోని మురుగుకాల్వ పక్కనే ఉండడంతో సిబ్బంది దుర్గంధంతో నానా పాట్లూ పడుతున్నారు. డీపీఓ ఆఫీసులో సుమారు 12 మంది ఒకే గదిలో నెట్టుకొస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

– అనకాపల్లికి రెండు కిలో మీటర్ల దూరంలోని శంకరంలో జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రజలకు కాలినడకే శరణ్యమవుతోంది. అధికారులంతా అద్దె భవనాల్లోనే కాలక్షేపం చేస్తున్నారు.

– ఎన్టీఆర్ కలెక్టరేట్‌ను విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పెట్టారు. ఇక్కడ ఇరుకు సమస్య వేధిస్తోంది.

– బాపట్ల జిల్లా ఏర్పాటయ్యాక ఒక్క భవనం కూడా నిర్మించలేదు. వేరే కార్యాలయాల భవనాల్లో కలెక్టరేట్, ఎస్పీ ఆఫీసులను పెట్టారు.

– పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్‌ను ఓ ప్రైవేటు ఇంజినీరింగు కళాశాలలో పెట్టారు. ఎస్పీ కార్యాలయానికి పొలాల మధ్య నుంచి వెళ్లాల్సి రావడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతమే.

– నంద్యాల కలెక్టరేట్‌ను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఒకే భవనంలో పోలీసు కార్యాలయంతో పాటు ఇతర ఆఫీసులు కొనసాగుతున్నాయి.

ఇలా చెప్పుకుంటూ పోతే కొత్త జిల్లాల్లో కోటి కష్టాలు కొలువుదీరాయనుకోవచ్చు. ఈ దుస్థితికి ప్రధాన కారణం వైకాపా నిర్లక్ష్య,నిర్లిప్త ధోరణే నడంలో సందేహం ఏముంటుంది?

## శతకోటి ఆశలతో.. వేరుశనగ విత్తనం ప్రారంభం



**పులివెందుల, జూన్ 11 (జనస్వరం) :** ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది.. ప్రకృతి కూడా అనుకూలించింది.. సకాలంలో వర్షం కురిసింది.. ఇంకేముంది శతకోటి ఆశలు మదిలో నింపుకుని రైతన్నలు వేరుశనగ విత్తనం ప్రారంభించారు. ప్రభుత్వం కూడా ఇదివరకే ఖరీఫ్ సీజన్లో వేరుశనగ సాగు చేసుకునే రైతులకు 40 శాతం రాయితీపై విత్తన కాయల పంపిణీ ప్రక్రియ కూడా పూర్తి చేసింది. అదును పదును కలిసి రావడంతో వేరుశెనగ విత్తనం సాగించేందుకు రైతులు సమాయాత్తమయ్యారు. ప్రస్తుతం వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 శాతం వరకు వేరుశనగ సాగించేవారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే కేవలం 10 నుంచి 20 శాతం మంది రైతులు మాత్రమే వేరుశనగ సాగు పట్ల మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. వేరుశనగ సాగుకు విపరీతంగా రావడంతో సాగుపట్ల మక్కువ చూపలేదని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. నేటి సమాజంలోవ్యవసాయం సాగిస్తున్న సగటు రైతు పశుసంపదను పోయాడు. కాడెద్దులు కూడా దొరకని పరిస్థితి నేడు ఎదురైంది. గతంలో పశుగ్రాసం కోసం వేరుశనగ సాగించే రైతులు నేడు ఆ పంటకు దూరం కావడం హృదయ విధారకరం. ఈ విధంగా వేరుశనగ సాగుకు ప్రత్యామ్నయంగా పత్తి, ఉద్ది, కంది, పెసర, ఇనుము తదితర పంటల సాగుపై రైతులు దృష్టి సారించారు. కృష్ణా జలాలు అందుబాటులో ఉన్న కారణంగా ప్రతి రైతు నీటి వసతిపై ఆధారపడి వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూడా సాగునీటిపైనే ఆధారపడి వేరుశనగ చేపట్టనున్నట్లు రైతులు వెల్లడించారు. ఖరీఫ్‌లో అడిగిన రైతన్నకు ప్రకృతి అనుకూలించాలని, వర్షాలు కురవాలని అన్ని విధాల మేలు జరగాలని ఆశిద్దాం.

## ఆత్మకూరులో విజయోత్సవ వేడుకలు



**ఆత్మకూరు, జూన్ 11 (జనస్వరం) :** జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, జనసేన నుంచి పోటీ చేసిన 21/21 మంది గెలుపోందిన వారికి, త్మకూర్ నియోజకవర్గం నుండి గెలుపొందిన ఆనం రామనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పారావుపాలెం గ్రామంలో "జనసేన విజయ ఢంకా" ఆత్మకూరు నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ పులిపాటి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు ప్రత్తిపాటి ప్రవీణ్ ఆధ్వర్యంలో, ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు నలిసెట్టి శ్రీధర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ పవన్ కళ్యాణ్ యువత అధ్యక్షుడు పవన్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు దాడి బాను కిరణ్, సీనియర్ నాయకులు ప్రసాద్, టౌన్ చిరంజీవి యువత అధ్యక్షుడు వంశీ, ఐటీ మెంబర్ అఖిల్, రాజా, జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# ఎన్నికల పక్రియ విజయవంతం

**- సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు**

**- జిల్లా కలెక్టర్**



**నంద్యాల, జూన్ 11 (జనస్వరం) :** జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాన్ని అత్యంత నైపుణ్య పద్ధతిలో శాంతియుతంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సార్వత్రిక ఎన్నికలు – 2024 విజయవంత ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా ఆధికారులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత సిబ్బందితో సక్సెస్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని తప్పొప్పులు మొదులుకొని కౌంటింగ్ ముగిసేంత వరకు సంబంధిత అధికారులందరి సమిష్టి కృషితోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతమైందన్నారు. జిల్లాకు రాగానే శివరాత్రి, ఉగాది ఉత్సవాలు... రాష్ట్ర ముఖ్యమంత్రి బనగానపల్లె పర్యటన వెను వెంటనే ఎన్నికల నగరాన మొదలైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఎన్నికల విధులను అధికారులకు అప్పగించామన్నారు. అప్పగించిన పనులను అలసిపోకుండా ఎవరి కేడర్లో వారు సమర్థవంతంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముగించారన్నారు. ముఖ్యంగా వెన్నెముక లాంటి కలెక్టరేట్ సిబ్బంది, ఎన్నికల విభాగపు సిబ్బంది పూర్వపు అనుభవం లేకపోయినప్పటికీ రాత్రింబవళ్లు విసుగు, విరామం చెందకుండా ఎన్నికల విధులు నిర్వహించారన్నారు. అదేరీతిలో రిటర్నింగ్ అధికారులు, అన్ని టీంల నోడల్ అధికారులు, లైజన్ అధికారులు, మండల తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సాంకేతిక సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల విధుల్లో పాల్గొని తమ వంతు పాత్ర పోషించారన్నారు. ఎన్నికలు విధులు అప్పగించేందుకు సిబ్బందిని సమకూర్చడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ అధిగమించి విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నుండి వచ్చిన సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు సైతం నూతన జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ ముసిందని ఆశ్చర్యచకితులయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం అవిరళ కృషి చేసిందని ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ కృతజ్ఞతాభివందలను తెలిపారు. ఎన్నికల నిర్వహణ మొదటి సారి అయినప్పటికీ అందరి సహకారం, సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. ఏ పని చేయాలనుకున్నామో ఆ పని పట్ల భౌతికంగా, మానసికంగా సిద్ధమైతే సాధ్యమవుతుందని హితవు పలికారు. అడ్మినిస్ట్రేషన్ లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ గత ఫిబ్రవరి మాసం నుండి అధికారులందరూ కొత్త ఎనర్జీతో ఎన్నికల ఒరవడిని సాహసోపేతంగా నిర్వహించారన్నారు. సాధారణ ఎన్నికలు 2024 అనేవి అందరికీ విత్తు లాంటిదని భవిష్యత్తులో జరిగే ఎన్నికలకు ఎక్స్పీరియన్స్‌గా ఉపయోగపడుతుందన్నారు. సూక్ష్మ లోపాలు మినహా అధికారులందరూ సరైన టైంలో బాధ్యత తీసుకొని సమిష్టి కృషితో సమర్థవంతంగా ఎన్నికల విధులను నిర్వహించారని కొనియాడారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మజ, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, బనగానపల్లి, నందికొట్కూరు రిటర్నింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సుధారాణి, కామేశ్వర రావు, ఎం దాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, భూగర్భ గనుల శాఖ ఏడి రామచంద్ర డిపిఓ మంజులవాణి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ జెహారున్నిసా బేగం తదితర జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుకు జిల్లా అధికారుల బృందం శాలువా కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

## నల్లపురెడ్డిపల్లెలో మలేరియా మాసోత్సవం




**పులివెందుల జూన్ 11 (జనస్వరం) :** మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మలేరియా మాసోత్సవం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బాలాజీ మాట్లడుతూ దోమ పుట్టుకను నివారించాలని, దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చున్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే  ఫ్రైడెగా నిర్ధారించి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త చెదరాలను తొలగింపజేయడంతో పాటు మొక్కలు, నీటి కుండీలు, రుబ్బు రోళ్లులో ఉన్న నీటిని నిల్వలను తొలగింపజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమ వ్యాప్తి నివారణలో భాగంగా కదలిక లేని నీటి నిల్వలపై దోమలు గుడ్లు పెట్టి 8 నుండి 10 రోజులలోపు దోమగా రూపాంతరం చెందుతుందని ప్రజలకూ వివరిస్తున్నామని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య, సూపర్ వైజర్ జగదీష్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్. అరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ముస్లిం సోదరులు



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** మున్సిపాలిటీలో ఉన్న జామియా మస్జిద్‌లో ముస్లిం సోదరులు యువత అందరూ కలిసి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే సుందర విజయకుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారన్నారు. ఈ  కార్యక్రమంలో సాగర్ హుస్సేన్ (నన్న), ఎస్కే అజ్మీర్ వల్లి, ఎస్కే బషీరుద్దీన్, సయ్యద్ బషీరుల్లా, షేక్ బుఖారి, ఎండి హుస్సేన్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# “శరణమా.. రణమా” తేల్చుకోవాల్సిన పరిస్థితి

- వైసీపీ నేతలు, కార్యకర్తలకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ హెచ్చరిక
- వైఎస్ జగన్ జైలుకు వెళ్లడం ఖాయం
- అందుకే వైసీపీ నాయకులు పక్క చూపులు చూస్తున్నారు
- అరాచకాలకు కారకులైన వారిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్



**విశాఖపట్నం, జూన్ 11 (జనస్వరం) :** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని, అందుకే అనేక మంది వైసీపీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. వైసీపీ నేతలు ప్రస్తుత పరిస్థితులలో “శరణమా – రణమా” అని తేల్చుకోవాలని హెచ్చరించారు. ఇదే అంశంపై వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బి.వి రామ్ మాట్లాడుతూ వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఆ పార్టీ ముఖ్య నాయకులు వైసీపీని వీడ్కోలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సాక్షాత్తు నెల్లూరు మేయర్ వైసీపీకి వీడ్కోలు చెబుతున్నారని ప్రస్తావించారు. వైసీపీలో ముందు నుంచీ కూడా వైఎస్ జగన్ నియంత పాలన కొనసాగిందని, కనీసం ఆ పార్టీ ముఖ్య నాయకులకు కూడా అపాయింట్మెంట్ లభించేది కాదన్నారు. పార్టీ అధినేతతో ఇతర నాయకులు కలవకుండా ధనుంజయ రెడ్డి అడ్డుకునేవారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లోనే వైసీపీ పూర్తిగా నిర్వీర్యం కావడం ఖాయమని బి.వి.రామ్ జోస్యం చెప్పారు.

**అధికారం పోయినా అరాచకం ఆగడం లేదు**

గతంలో వైసీపీ చేసిన తప్పిదాలే ఆ పార్టీ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. మరో వైపు అధికారాన్ని కోల్పోయినప్పటికీ అరాచకాన్ని, హత్యా రాజకీయాలను వైసీపీ కొనసాగిస్తోందని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణగా కర్నూలులో గౌరీనాథ్ చౌదరి అనే టీడీపీ నాయకుడిని దారుణంగా హత్య చేశారన్నారు. ఒకవైపు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతూ ఉండగానే మాచర్లలో దారుణాలకు ఒడి కట్టారని ప్రస్తావించారు. ఒకవైపు వైసీపీ నాయకులే అక్రమాలకు పాల్పడుతూ.. మరోవైపు టీడీపీపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. టీడీపీ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని, విద్వేషాలను ఎట్టి పరిస్థితులలోనూ రెచ్చగొట్టే పరిస్థితి ఉండదన్నారు. ఏది ఏమైనప్పటికీ చంద్రబాబు పరిపాలనతో రాష్ట్రంలో మళ్లీ రామరాజ్యం ప్రారంభమైందని, వైఎస్ జగన్ లాంటి రాక్షసులు ఎంతమంది వచ్చినా ప్రజలకు సుపరిపాలన అందిస్తారన్నారు. ఏ తప్పు చేయకపోయినా చంద్రబాబుపై అక్రమంగా కేసులు బనాయించారని, పవన్ కళ్యాణ్‌ను హెూటల్ గది నుంచి బయటికి రాకుండా విశాఖలో అడ్డుకున్నారన్నారు. అరాచకాలకు కారకుడైన వైఎస్ జగన్ లాంటి చీడపురుగులను రాష్ట్ర బహిష్కరణ చేయాల్సిన అవసరం ఉందని రామ్ వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో టీడీపీ 14వ వార్డు అధ్యక్షుడు పి.వి. వసంతరావు, ఉప్పలపాటి కూర్మారావు, బి.రమాదేవి, కొయ్య రామకృష్ణ, కే.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రివర్గ కూర్పులో ఏపీకి అన్యాయం

**డాక్టర్ ఎన్ తులసి రెడ్డి**



**పులివెందుల, జూన్ 11 (జనస్వరం) :** కేంద్ర మంత్రివర్గ కూర్పులో ఏపీకి అన్యాయం జరిగిందని పీసీసీ మీడియా ఛైర్మన్ తులసి రెడ్డి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ 29 ఎంపీలు ఉన్న మధ్యప్రదేశ్‌కు 5 కొలువులు, అలాగే 28 ఎంపీలు కర్ణాటక రాష్ట్రానికి 5, అదేవిధంగా 26 ఎంపీలు ఉన్న గుజరాత్ రాష్ట్రానికి 5, అలాగే 25 మంది ఎంపీలు ఉన్న కర్ణాటక రాష్ట్రానికి ఐదు మంది మంత్రి పదవులను కేటాయించారన్నారు. కానీ 25 మంది ఎంపీలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేవలం ముగ్గురికి మాత్రమే కేటాయించారన్నారు. ఇందులో ప్రజలతో ఏమాత్రం సంబంధం లేని పౌర విమానం శాఖ ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కేటాయించారని తెలిపారు. ఇది అన్యాయం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హెూదా కోసం కాంగ్రెస్ పార్టీ ముమ్ముందు పోరాటం చేస్తుందని, ఈ విషయంలో ఏ మాత్రం తగ్గేదే లేదని తులసి రెడ్డి తేల్చి చెప్పారు.

## మన ఆచార సాంప్రదాయాలను పాటిద్దాం



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** మన హిందూధర్మంలో ఆచార సాంప్రదాలు మన ఆరోగ్యాన్ని ఎంతగానో ఉపయోగపడతాయని, మన ఆచార సాంప్రదాయాలను పాటిద్దామని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బివి రమణ అన్నారు. ఎమ్ జగర్నధపురంలో ఇంటింటా ధర్మప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవజాతి ఆవిర్భావం నుండి సనాతన ధర్మాన్ని పాటించటం జరుగుతుందని, మన జీవన విదానంలో మన ఆరోగ్యపరిరక్షణ కొరకు కొన్ని నిబందనలు, ఆచార సాప్రదాయాలు నియమించారు. ఇప్పుడు ఎవరో వచ్చి ఏదో మతమని మాయమాటలు చెప్పి నుదిటిన బొట్టు, వాకిట కల్లాపు, గుమ్మానికి పసుపు, పెరటిలో తులసి చెట్టు లాంటివి మనకు దూరం చేస్తున్నారు.వాటిని పాటించటం ద్వారా కొన్ని అనారోగ్య సమస్యల నుండి బయటపడవచ్చుని, మన సనాతన ధర్మం గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి స్టిక్కరును అతికించి, కరపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, మహిళా కో కన్వీనర్ బంటు రాము, భీముని, జోగినాయుడు, బంటు ఆనంద్, పీలా శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వికలాంగ కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



**పులివెందుల, జూన్ 11 (జనస్వరం) :** తెలంగాణలోని సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేసి, ప్రస్తుతం టిఎస్ఆర్టిసి మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ తన తల్లిదండ్రుల స్మారకార్థం పట్టణంలోని పుల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలో వికలాంగుల కమ్యూనిటీ భవనంలో హెలెన్ కెల్లర్ స్మారకోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో సంఘమిత్ర సేవా సంస్థ అధ్యక్షులు సిరాజుద్దీన్, సోమశేఖర్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫీజుల్లా తదితరుల చేతుల మీదుగా 30 మంది నిరుపేద వికలాంగుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అంతకు మునుపు అంధ బధిర దివ్యాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణం రోటరీపురానికి చెందిన వల్లెపు రోజా అనే అంధురాలైన తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థినికి బిఈడి విద్య కొరకు 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తానని సోమశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, గంగాధర్ రెడ్డి, బషీర్, జగదీష్, రాజు, డేవిడ్ తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.

## సీనియర్ మెన్ హాకీ పోటీలకు అనకాపల్లి జిల్లా జట్టు ఎంపిక

**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** అనంతపురం సత్య సాయి జిల్లాలో జరగబోవు సీనియర్ మెన్ హాకీ పోటీలకు అనకాపల్లి జిల్లా జట్టును 13న యలమంచిలి డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు ఎంపిక చేశారన్నారు. 1995 తరవాత జన్మించిన వారిని అర్హులుగా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు వీరు నాయుడు, కార్యదర్శి నరేశ్ తెలిపారు.

## ఆదివాసీలను అవమానపరిస్తే ఖబడ్దార్

**భారత్ ఆదివాసి పార్టీ**



**గూడెం కొత్తవీధి, జూన్ 11 (జనస్వరం) :** ఎస్టీలతోనే పాడేరు, అరకు నియోజకవర్గాలు అభివృద్ధికి దూరమని అరకు పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం వ్యాఖ్యలపై భారత్ ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. పాడేరు అరకు నియోజకవర్గాలు పూర్తిగా గిరిజన రిజర్వుడ్ నియోజకవర్గాలకు ఎవరిని ఎంపీని, ఎమ్మెల్యే చేసుకోవాలో ఇక్కడ ఆదివాసీలకు తెలిశానని, అరకు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఐదు నియోజకవర్గాలు కూటమి గెలిచినప్పటికీ పార్లమెంటు అభ్యర్థి ఒక బోగస్ గిరిజనురాలని, బ్యాంకు లూటిదారని ఇక్కడ ఆదివాసులు తిరస్కరించడంతో, పాడేరు అరకు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థులు కూడా ఓడిపోయారని, కూటమి అభ్యర్థి అయిన కొత్తపల్లి గీత గెలిచినట్లయితే ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులు తీసుకురావడానికి కృషి చేస్తారని, పసిగట్టిన ఆదివాసీలు కొత్తపల్లి గీతను ఓడించారు. పాడేరు, అరకు ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ఆమెతో చేతులు కలిపినట్టు తెలిసి ంది. ఈ విషయాలను ఆదివాసీలు నిశితంగా పరిశీలించి ఓట్లు వేశారన్నారు. అదే క్రమంలో గిడ్డి ఈశ్వరి వెనకాల ఆమె రాజకీయ గురువు అని చెప్పుకునే గోవిందు మీద ఆదివాసిలు తీవ్రమైన వ్యతి రేకతను చూపించారు. గిడ్డి ఈశ్వరి పాడేరు ఎమ్మెల్యేగా గెలిచినట్లయితే కొంతమంది గిరిజనేతరులు ఆదివాసి చట్టాలను అతిక్రమించి వ్యవహరిస్తారని అందుకే గిడ్డి ఈశ్వరిని ఓడించారు. బీజేపీ ఆదివాసీలకు వ్యతిరేకంగా తీసుకొంటున్న చర్యల కారణంగా అరకు వేలి నియోజకవర్గంలో బీజేపీని ఓడించారు. ఈ నియోజకవర్గాలు పూర్తిగా గిరిజన నియోజకవర్గాలు గెలిచింది ఓడింది గిరిజనులే, అనవసరంగా గిరిజనేతర్లు తల దూర్చి ప్రశాంతమైన వాతావరణాన్ని పాడు చేయవద్దని హితువు పలికారు.

## ఎమ్మెల్యే సుందరపును మర్యాదపూర్వకంగా కలిసిన 20వ వార్డు నాయకులు



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** యలమంచిలి మున్సిపాలిటీ టౌన్ పార్టీ అధ్యక్షులు బొద్ధపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్దపల్లి 20వ వార్డ్ ఇంచార్జ్ బొద్ధపు గణేష్ సుందర్పు సత్యవతి, సుందర్పు దొర, ముచ్చకర్ల గోవిందులు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు వైసీపీ నాయకుల అభినందనలు



**చింతపల్లి, జూన్ 11 (జనస్వరం) :** ఇటీవల జరిగిన ఎన్నికలలో పాడేరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఘన విజయం సాధించిన మత్స్యరాస విశ్వేశ్వర రాజుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగానే మంగళవారం చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివెల్లి నూతన ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించే అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గ ప్రజల నుంచి స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో అధికారం లేకపోయినా ప్రజల సమస్యలు పరిష్కరించడమే వైసీపీ లక్ష్యమని గుర్తు చేశారు. 2029 ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుకు పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి విజయం సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లమ్మ, కామాక్షి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 11 కోఆపరేటివ్ సొసైటీ నామినేటెడ్ పోస్టులకి రాజీనామా



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** యలమంచిలి మార్కెట్ కమిటీ పాలక మండలి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రస్తుత ఛైర్మన్ ఎర్రయ్యదొర తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ, మార్కెట్ కమిటీతోపాటు నియోజకవర్గంలో ఉన్న 11 కోఆపరేటివ్ సొసైటీల త్రిసభ్య కమిటీల తాత్కాలిక అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు వైసీపీ ఓటమికి నైతిక బాధ్యతగా తమ పదవులకు మంగళవారం రాజీనామా చేస్తున్నట్లు ఎర్రయ్య దొర తెలిపారు. ఈ రాజీనామా పత్రాన్ని వైసీపీ సీనియర్ నాయకులు డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమార్ వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా సుకుమార్ వర్మ మాట్లాడుతూ ఇప్పుడు వరకు వైసీపీ ప్రభుత్వంలో రైతులకు పలు సంక్షేమ కార్యక్రమాలతో పాటు సబ్సిడీలు అందజేశామన్నారు. ఇకపై ప్రతిపక్షంగా ఉండి రైతుల పక్షాన పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కస్పా రవికుమార్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ నీరుకొండ వెంకట సూరి నారాయణ, మల్ల కొండబాబు, నియోజకవర్గంలో ఉన్న 11 సహకార సొసైటీల అధ్యక్షులు రాజీనామా చేసిన వారు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన దుళ్ల విద్యార్థిని బాల చంద్రిక

**ఎంసెట్‌లో 148 ర్యాంక్, నీట్‌లో 680 మార్కులు**



**కడియం, జూన్ 11 (జనస్వరం) :** తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వట్టి బాల చంద్రిక ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 148 ర్యాంక్ సాధించి సత్తా చాటింది. ఆలాగే ఇటీవల వచ్చిన వైద్య కోర్సుకు సంబంధించి నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 680 మార్కులు సాధించి ఉత్తమ ర్యాంక్ పొందింది. చేనేత కుటుంబానికి చెందిన బాల చంద్రిక చదువుల్లో రాణించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చెందుతున్నారు. బాల చంద్రిక తండ్రి మల్లేశ్వర్ రావు, తల్లి నాగ కుమారి లు స్థానికంగా కిరాణా వ్యాపారం నిర్వహిస్తూ వుంటారు. ర్యాంకు సాధించిన బాల చంద్రిక మాట్లాడుతూ వైద్య, విద్యలో రాణిస్తూ కార్డియాలిజీలో పట్టా పొంది నాణ్యమైన వైద్యాన్ని అందరికీ అందేలా వంతు సహకారంతో అందించాలని కోరిక ఉన్నట్లు తెలిపింది. మంచి లక్ష్యంతో వైద్య రంగంలో ముందుకు వెళ్లాలని సంకల్పంతో ఉన్న బాల చంద్రిక వైద్య విద్యలో ఉన్నతంగా రాణించాలని కోరారు. అలాగే బాల చంద్రిక కాతేరులోని తిరుమల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ చదవగా వెయ్యి మార్కులకు గాను 987 మార్కులు సాధించింది. అలాగే చంద్రిక సోదరి పావని నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదివి ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతోంది. మల్లెస్వరరావు, నాగ కుమారి దంపతులు ఇద్దరు కుమార్తెలు చదువుల్లో ఉన్నతంగా రాణించడంతో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేసారు.

## ఆర్ అండ్ ఆర్ కాలనీలను పరిశీలించిన ఎంపీడీవో



**విఆర్ పురం, జూన్ 11 (జనస్వరం) :** రానున్న గోదావరి వరదల దృశ్య ముందస్తు చర్యలలో భాగంగా చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు విఆర్ పురం మండల ఎంపీడీవో ఆర్.ఫణింద్ర విఆర్ పురం మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు కేటాయించినటువంటి ఆర్ అండ్ ఆర్ కాలనీలను పశ్చిమగోదావరి జిల్లాలోని బుట్టాయిగూడెం మండల పరిధిలోని రామన్నగూడెం, జంగారెడ్డిగూడెం మండల పరిధిలోని తాడువాయ ఆర్ అండ్ ఆర్ కాలనీలను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలు తెలుసుకోవడం కోసం వచ్చినట్లు తెలిపారు. రానున్న వరదల దృశ్య నిర్వాసిత ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా తమకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్వాసితులు క్షేమంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవడంలో భాగంగానే కాలనీ పర్యవేక్షించినట్లు తెలిపారు.

## వాలంటీర్లు భవిష్యత్తు అగమ్య గోచరమా..?

**వైసీపీ ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో రాజీనామా చేసిన ఫలితం**



**నంద్యాల, జూన్ 11 (జనస్వరం) :** వైసీపీ ఎమ్మెల్యేలు చెప్పారనో, ఆ పార్టీ నేతలు ఒత్తిడి తెచ్చారనో రాజీనామా చేసిన గ్రామ, వార్డు వాలంటీర్ల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఉన్న దాంతో పాటు రాబోతున్న అదనపు ఆర్థిక ప్రయోజనాలూ కోల్పోతున్నామని వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక రాష్ట్రవ్యాప్తంగా 1,08,273 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. వీరిలో అత్యధికంగా అనంతపురం జిల్లాలో 6,398 మంది నంద్యాల జిల్లాలో 3205 మంది పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యల్పంగా 515 మంది ఉన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ తరపున ప్రచారం చేయాలన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ఒత్తిళ్లతో వీరు వాలంటీరు ఉద్యోగాలను వదులుకున్నారు. వీరిలో చాలా మంది ప్రచారంలో వైసీపీ అభ్యర్థులకు అండగా నిలబడ్డారు. ఓటర్లకు తాయిలాల పంపిణీలో కీలకంగా వ్యవహరించారు. తీరా, ఎన్నికల్లో వైకాపా బోర్లా పడటం, ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండటంతో రాజీనామా చేసిన వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమ భవిష్యత్తేంటని ప్రశ్నిద్దామన్నా, వైసీపీ నేతలు ముఖం చాటేస్తున్నారని వాపోతున్నారు. ఒత్తిళ్లకు తలొగ్గక కొనసాగిన వారంతా మంచి రోజులు రాబోతున్నాయని ఆశిస్తున్నారు. వాలంటీర్ల పారితోషికం రెట్టింపు చేస్తామన్న చంద్రబాబు హామీ వారిని ఊరిస్తోంది. ఏదేమైనట్టు ఇప్పటికే వాలంటీర్ల పరిస్థితిపై భిన్నాభిప్రాయాలు వెలబడుతున్నాయి.

## శారదా నదిలో పడి ఇద్దరు యువకుల మృతి



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** మండలంలోని తెరవుపల్లి గ్రామంలో శారదా నదిలో మునిగి దిమిలికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు, గాజువాకకు చెందిన జగన్ అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే వారం రోజుల క్రితం మేనమామ ఇంటికి వచ్చిన వీరు ప్రతిరోజు నదికి వెళ్లేవారని, ఇవాళ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల వీరు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ పి.సింహాచలం తెలిపారు. ఈ మేరకు యువకుల బంధువులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ పి.సింహాచలం అన్నారు.

# కెనడాలో జనసేన ఎన్నికల విజయోత్సవాలు












అమరావతి, జూన్ 11 (జనస్వరం) : 2024 జూన్ 8న, వాంకోవర్ నగరంలో జనసేన పార్టీ విజయం ఉత్సాహంగా జరుపుకున్నారు. జనసేన అభిమానులు పవన్ కళ్యాణ్ 21 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలను 100 శాతం విజయంతో గెలవడాన్ని ఆనందంగా జరుపుకున్నారు. వాంకోవర్ జనసేన పార్టీ సభ్యులు, కమ్యూనిటీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాంకోవర్లో ఎన్డీయే కూటమి సభ్యులైన టీడీపీ, బీజేపీ నాయకులు కూడా ఈ వేడుకలో పాల్గొని కూటమి విజయాన్ని ప్రశంసించారు. కెనడాలోని వివిధ ప్రాంతాలలో జనసేన విజయోత్సవాలు జరిగాయి. వారు "జై జనసేన! జై పవన్ కళ్యాణ్!" అంటూ నినదించారు. వాంకోవర్ ఏరియా తెలుగు అసోసియేషన్ శశాంక కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామ్యమై ఉన్న, తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్ర ఎన్నికల విశ్లేషణలో, ప్రతిపక్షాన్ని ఐక్యంగా ఉంచడం, ఉచితాల కంటే మొత్తం అభివృద్ధి ప్రధానమైనదని తెలియజేసిన తీరు, ఒక మంచి కేస్ స్టడీగా ఉపయోగపడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘన విజయానికి ఆయన అందరికి ధన్యవాదాలు తెలిపారు. మీరు వీఏటీఏ అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుకుంటున్నారు. ఆంధ్రలో కూటమి చేసినట్లుగా, మనమూ కలిసి కెనడాలో గొప్ప విషయాలు చేయగలమన్నారు. లక్ష్మీ నారాయణ దేవాలయ సెక్రటరీ వినయ్ శర్మ ప్రతి సభ్యుడిని, మోడీ జీ మూడో సారి ప్రధాని కావడానికి మార్గం సుగమం చేసినందుకు ప్రశంసించారు. కెనడాలో 27 సంవత్సరాలు గడచిన తర్వాత కూడా, ఆయన ఇంకా భారతదేశ ఐక్యతను కోరుకుంటున్నారు. తన స్వదేశం గురించి కలలు కనడం కొనసాగిస్తున్నారు. మనం భారతదేశంలో, విదేశాలలో ఐక్యంగా ఉన్నంత వరకు మనను ఎవ్వరూ విభజించలేరని పేర్కొన్నారు. మోడీ గొప్ప విజయానికి తోడ్పడిన జనసేన, టీడీపీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలిపారు. అమృత్ పాల్ సింగ్ ధోట్ (ఎమ్మెల్యే అభ్యర్థి డెల్టా-ఉత్తర, బిసి యునైటెడ్ పార్టీ) జనసేన, టీడీపీ, బీజేపీలను ఐక్యం చేసినందుకు పవన్ కళ్యాణ్‌ని ప్రశంసించారు, ఇది ఆంధ్ర ఎన్నికల్లో విజయాన్ని తీసుకువచ్చింది. మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా ఎదగడాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎన్నికైన సభ్యులు, ప్రముఖులు వీడియో కాల్‌ల ద్వారా తమ శుభాకాంక్షలు, ఆనందాన్ని ప్రేక్షకులతో పంచుకున్నారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుభాకాంక్షలు, ఆనందాన్ని తెలిపారు. ఐటి చైర్మన్ శ్రీనివాస్ మీరియాల మాట్లాడుతూ, జనసేన స్వరం, విధానాలను ప్రచారం చేయడానికి కెనడా జనసేన బృందం అందించిన వీడియో ఎడిటింగ్ శిక్షణ ఎంతగానో సహాయపడిందని పేర్కొన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్ కుమార్ ఎన్నికలలో అందరూ ఎన్ఆర్ఐలు కష్టం, మద్దతును గుర్తించారు. ఏపీ ప్రజలు ఇచ్చిన భారీ మెజారిటీ ఒక బాధ్యత అని, తదుపరి ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు సేవ చేయడంపై దృష్టి సారించడానికి, ఈ ప్రయత్నానికి నిరంతర సహకారం అందించడానికి ప్రోత్సహించారు. రాఘవేంద్ర ముదుంబా పవన్ కళ్యాణ్‌ని అనుకరించిన తీరు అందరిని ఆకట్టుకున్నది. జనసేనాని కటౌట్‌తో ఫోటో సెషన్, పవన్ కళ్యాణ్ మన మధ్య ఉన్న భావన కలిగించింది. జనసేన వీర మహిళలు కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకల్లో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఆహా రెస్టారెంట్ నుండి వచ్చిన విందు భోజనంతో సభ ముగిసింది. ఈ కార్యక్రమాన్ని సురేష్ యేనుగ, బాల గుద్దేటి, జనార్ధన్ గోన, ఈశ్వర్ చంద్ర సాగర్ నేదునూరి, హరికృష్ణ దాసరి అనే స్వచ్ఛంద సేవకులు నిర్వహించారు. ముఖ్య స్పాన్సర్లలో సుందరపు వెంకట వర్ధన్ (సెవెన్ హిల్స్ డ్రైవింగ్ అకాడమీ), రవి వెన్న (పర్సనల్ రియల్ ఎస్టేట్ కార్పొరేషన్) ప్రత్యేకంగా ప్రస్తావించబడ్డారు. ఈ మొత్తం కార్యక్రమంలో వారి మద్దతు కోసం సందీప్ మొక్కరాల, కార్తికేయ పగడాల వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో లెగో ప్లేగ్రౌండ్

**జూన్ 7 నుంచి 16వ తేదీ వరకు 5 నుంచి 14 ఏళ్ల పిల్లలకు అవకాశం**




**హైదరాబాద్, జూన్ 11 (జనస్వరం) :** ఈ వేసవిలో పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో లెగో ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేశారు. ఈ ప్లే గ్రౌండ్ జూన్ 7 నుంచి 16వ తేదీ వరకు ఉంటుంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు తెరిచి ఉంటుంది. 5 నుంచి 14 ఏళ్ల పిల్లలందరికీ ఈ ప్లేగ్రౌండ్లోకి అవకాశం ఉంది. హైదరాబాద్ మాల్‌లో ఆడేందుకు, సమయాన్ని వెచ్చించేందుకు వేసవి సెలవులు ఉత్తమ సమయం. ఆట అనేది కేవలం విశ్రాంతి కోసం మాత్రమే కాదు. ఇది ఒక సూపర్ పవర్. పిల్లలలో ఉత్సుకతను పెంచుతుంది. జీవితకాల అభ్యాస అనుభవాలను అందిస్తుంది. లెగో బ్రిక్స్ పిల్లలలో సృజనాత్మకతను పెంచుతుంది. సృష్టించడానికి, పునఃసృష్టించడానికి సరైన గేట్‌వే. ఈ ప్రక్రియ ద్వారా సమస్య పరిష్కారం, అవగాహన, చక్కటి నైపుణ్యాలను పిల్లలు నేర్చుకుంటారు. లెగో ప్లేగ్రౌండ్ అనేది ఒక ఆహ్లాదకరమైన, చల్లని, ఊహాత్మకమైన, సృజనాత్మకమైన ఆట స్థలం. ఇక్కడ పిల్లలు తమ అభిరుచులు అన్నింటినీ అన్వేషించవచ్చు. పిల్లలు ఔత్సాహిక వ్యోమగామి అయినా, సూపర్ హీరో అభిమాని అయినా, వర్ధమాన శాస్త్రవేత్త అయినా, హ్యారీ పోటర్ ప్రేమికుడు అయినా ఈ ప్లే గ్రౌండ్ ప్యాషన్ జోన్‌లు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక దాన్ని అందిస్తుంది. సైన్స్, టెక్నాలజీ ఔత్సాహికులు లెగో స్టెమ్ ల్యాబ్‌ని అన్వేషించవచ్చు. నెక్సస్ హైదరాబాద్ మాల్‌లోని ఈ సంవత్సరం లెగో ప్లేగ్రౌండ్‌లో ఎన్నో ఆహ్లాదకరమైన విషయాలు ఉన్నాయి. ఫ్రెండ్స్ జోన్‌తో స్పేస్ సిటీ, పిల్లలు సరికొత్త స్పేస్ బేస్ రూపొందించడానికి అవకాశం పొందుతారు. సూపర్ హీరో స్క్వాడ్ జోన్.. పిల్లలు తమ స్పేస్ బేస్‌ను చెడు శక్తుల నుంచి రక్షించుకోవడానికి, ఇష్టమైన నిన్జాస్, హ్యారీ పోటర్, స్టార్ వార్స్, మార్వెల్, డీసీ నుంచి సూపర్ హీరో స్పేస్‌షిప్‌లు, యాక్షన్ మెచ్‌లు మరిన్నింటితో నిండిన సూపర్ హీరో స్క్వాడ్‌ను నిర్మించే అవకాశాన్ని పొందుతారు. ఎక్స్‌ప్లోరర్స్ జోన్, పిల్లలు తమకు ఇష్టమైన స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ వెహికల్స్ స్క్వాడ్‌ను నిర్మించవచ్చు. ఇక లెగో గుడ్డీస్, పిల్లలందరూ వెళ్లేటప్పుడు ప్రత్యేకంగా క్యూరేటెడ్ లెగో గుడ్డీ బ్యాగ్‌ని అందుకుంటారు. పిల్లలందరూ సరదా పోటీలు, సవాళ్లు, క్విజ్‌లలో పాల్గొనే అవకాశాన్ని పొందుతారు. అదే సమయంలో కొంతమంది ఐకానిక్ లెగో మినీఫిగర్ స్నేహితులను కలుసుకుంటారు. రెడ్ టెలిఫోన్ బాక్స్, నిన్జాగో సిటీ గార్డెన్, డిస్నీ కాజిల్, గ్రింగోట్స్ విజార్డింగ్ బ్యాంక్, ఎవెంజర్స్ టవర్, ఈఫిల్ టవర్, టైటానిక్ తదితర లెగో సెట్‌లను హ్యామ్లీ స్టోర్‌లలో మాత్రమే పొందవచ్చు.

## తాళ్లమ్మ తల్లికి మొక్కులు తీర్చిన కూటమి నాయకులు



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** యలమంచిలి ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ అఖండ విజయం సాధించాలని కోరుతూ మండలంలో ఫోతిరెడ్డిపాలెంలో తాళ్లమ్మ తల్లికి కూటమి నాయకులు వేడుకున్న మొక్కులను మంగళవారం తీర్చుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు అమ్మవారికి 101 కొబ్బరికాయ కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టీడీపీ నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీను, కాల్ల సత్యనారాయణ, టీడీపీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## అలరిస్తున్న జాతీయ నాటకోత్సవ ప్రదర్శనలు

**- కుటుంబంలో నాన్న విలువ తెలిపేలా ఇంద్రప్రస్థ నాటక ప్రదర్శన**

**- కళాకారులు ప్రేక్షకులు లేకపోతే కళారూపాలు కనుమవుతాయని తెలిపిన కమనీయ నాటక ప్రదర్శన**









**చీరాల, జూన్ 11 (జనస్వరం) :** కళాంజలి సాంస్కృతిక మిత్ర మండలి ఆధ్వర్యంలో, చీరాల కస్తూరిబా గాంధీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో, డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్ కళాప్రాంగణంలో, ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవ ప్రదర్శనలు, కళాభిమానులను అలరిస్తున్నాయి. ఎన్.రవీంద్ర రెడ్డి దర్శకత్వంలో, గోపి సత్య ప్రకాష్ రాసిన ఇంద్ర ప్రస్థం నాటక ప్రదర్శన, కుటుంబంలో నాన్న విలువను తెలియజేసేలా, కళాకారులు అత్యద్భుతంగా తమ పాత్రలు పోషించి, ప్రేక్ష కులప్రశంసలు అందుకున్నారు. డాక్టర్ బీరం సుందరరావు, భాగ్యలక్ష్మి, వలివేటి మురళీకృష్ణ, జయ శ్రీ దంపతులు, ప్రదర్శనా పారితోషికం అందజేసి, దర్శకుడ్ని జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. ఆ తర్వాత బసవరాజు జయశంకర్ దర్శకత్వంలో, మునిపల్లె విద్యాధర్ రచించగా, గుంటూరు సద్గురు కళానిలయం వారు, ప్రదర్శించిన కమనీయం నాటిక, కళాకారులు, ప్రేక్షకులు లేకపోతే, కళారూపాలు కనుమరుగవుతాయని, కళారూపాల ప్రదర్శించే చోటికే, ప్రేక్షకులు వచ్చి తిలకించి, సదాలోచనతో సమ సమాజం వైపు, అడుగులు వేయాలని ప్రబోధించింది. తొలుత స్వర్గీయ బీరం వెంకటసుబ్బయ్య, పున్నమ్మల చిత్రపటానికి పూలదండలు వేసి, ఘనంగా నివాళులర్పించి, నటరాజ పూజతో, నాటకాల ప్రదర్శనలు ప్రారంభించారు. నంది అవార్డు గ్రహీత, ప్రముఖ రంగస్థల నటులు పూర్ణా సత్యం, ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావులు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తుండగా, గౌరవాధ్యక్షులు మామిడాల రాములు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమల శెట్టి సాంబశివరావులు, ఉపాధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, డాక్టర్ హైమా సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి రిటైర్డ్ ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి షేక్ దరియా సాహెబ్, కార్యవర్గ సభ్యులు పొట్టి శ్రీనివాసరావు, నక్కావీరబ్రహ్మం, వల్లభనేని మాధవరావు, వడలి రాధాకృష్ణ, మెడబలిమి లూక, భాగి కృష్ణ మూర్తి, పెద్ద సంఖ్యలో హాజరైన కళాభిమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, తగిన ఏర్పాట్లు ఉండేలా పర్యవేక్షిస్తున్నారు.ఐ

## ప్రమాణ స్వీకారానికి ముస్తాబవుతున్న ప్రభుత్వ కార్యాలయం



**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** యలమంచిలి మున్సిపాలిటీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సీఎం చంద్రబాబు, కొణిదెల పవన్ కళ్యాణ్‌లు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాల అలంకరించారు.

## సచివాలయ వ్యవస్థలో భారీగా మార్పులు

**నంద్యాల, జూన్ 11 (జనస్వరం) :** వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థలో పనిచేసే వారంతా కూడా డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఉత్తీర్ణత సాధించిన వారే కావటం విశేషం. అయితే వీరికి ఉద్యోగ భద్రత ఉన్నప్పటికీ సచివాలయ వ్యవస్థలో కొనసాగించే పరిస్థితి ఎన్డీఏ ప్రభుత్వానికి లేకపోవటంతో వారిని ఆయా పేరెంట్స్ విభాగానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందుతుంది. ఒక గ్రామంలో 10 నుంచి 11 మంది సచివాలయ వ్యవస్థకు విభాగం కలిగించే అంశంగా ఈ ప్రభుత్వం భావిస్తుంది. సచివాలయ వ్యవస్థలో ఎక్కువ మంది సిబ్బంది ఉండటం వలనే ఈ నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ మేరకు గ్రేడ్-5 సెక్రటరీ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 ఉద్యోగికి ఉన్న పంచాయతీ బాధ్యతలు, క్లస్టర్ వ్యవస్థ రద్దు జనాభా, ఆర్థికపరంగా పంచాయతీలు కేటాయింపు జరుగుతుంది. అధిక సంఖ్యలో గ్రేడ్-5 ఉద్యోగులను గ్రేడ్-4 ఉద్యోగులుగా ప్రమోషన్ కల్పించనుంది. ఈ మధ్యకాలంలో ఎక్కువమంది పంచాయతీ కార్యదర్శులు పదవి విరమణ గ్రేడ్-5లకు కలిసి వచ్చే అవకాశం ఉంది. సంక్షేమ, విద్యా సహాయకులు, ప్రభుత్వం తీసుకొస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రధాన పాత్ర పోషించనున్నారు. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

**డిజిటల్ సహాయకులు**

డిజిటల్ అసిస్టెంట్‌లను జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా మార్చుతూ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌కి మార్చే అవకాశం ఉంది. స్కూల్‌లలో అన్ని రకాల డిజిటల్ వర్కులు డిజిటల్ అసిస్టెంట్‌లకి బాధ్యతలు అప్పగించనున్నారు. ఉపాధ్యాయులను అన్ని బోధనేతర పనుల నుంచి తప్పించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రతి హైస్కూల్‌కి ఒక డిజిటల్ అసిస్టెంట్ చొప్పున బాధ్యతలు అప్పగించనున్నారు. దీని వలన డిజిటల్ అసిస్టెంట్ లకు, పాఠశాలకు ఇద్దరకీ లాభం చేకూరుతుందని టీచర్ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సచివాలయంలో అందించే ప్రజాసేవలను యధావిధిగా మీసేవలకి మార్చే యోచనలో ప్రభుత్వం

**మహిళా పోలీస్**

వీరికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులు అయిన వారిని హోమ్ శాఖకు అప్పగించే బాధ్యతను తీసుకుంది. మిగిలిన వారిలో బాలికోన్నత పాఠశాలలో బోధనేతర సిబ్బందిగా కొంత మందిని, మహిళా జూనియర్ కాలేజీల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్స్ అసిస్టెంట్లుగా కొంతమందిని కేటాయిస్తూ మిగిలిన సిబ్బందిని కాళీగా ఉన్న ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ ఉద్యోగాలో పంపేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

**సచివాలయంలోని ఏఎన్ఎం**

కొత్త ప్రభుత్వంలో ఏఎన్ఎంలు పదోన్నతులు పొందనున్నారు. కరోనా సమయంలో వీరి సేవలకు గుర్తింపుగా ఎంఎల్‌హెచ్‌పిగా పదోన్నతులు ఇవ్వనున్నారు. వైద్య శాఖలో ఉన్న ఉన్నత ఉద్యోగాల ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**ఇంజినీరింగ్ అసిస్టెంట్స్**

ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా ఉన్న పలువురు ఉద్యోగులను పలు శాఖలలో ఉన్న ఖాళీలతో భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది.

**విలేజ్ సర్వేయర్**

అయోమయంలో విలేజ్ సర్వేయర్స్ ఉద్యోగస్తులు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయనున్న ప్రభుత్వం. వీరి ఉద్యోగాలను మార్పులు చేస్తూ వ్యవసాయ సహాయకులను వారి డిపార్ట్మెంట్‌కు అప్పగించనున్నట్లు ఆదేశాలు అందాయి. వీఆర్‌ఓలను యధావిధిగా వారి రెవెన్యూ శాఖలో విలీనం చేయనున్నారు. పశుసంవర్ధక సహాయకులను వారి డిపార్ట్మెంట్‌కు అప్పగించ నున్నట్టు ఆదేశాలు ఆయా డిపార్ట్మెంట్‌కు చేరాయి. సచివాలయానికి ఐదుగురు చొప్పున వాలంటీర్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వాలంటీర్ల జీతం రూ.10 వేలుకు పెంపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్పులకు మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు తీసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## కరెంట్ స్తంభానికి ఉన్న ట్రాన్స్ఫార్మర్ను తొలగించాలి




**చర్ల, జూన్ 11 (జనస్వరం) :** చర్ల మండలం కలివేరు గ్రామపంచాయతీలోని లింగాల కాలనీ గ్రామంలో సిఆర్‌పిఎఫ్ పోలీస్ క్యాంప్ ఎదురు సందులో ఉన్న కరెంట్ స్తంభానికి ఉన్న ట్రాన్స్ఫార్మర్ను తొలగించాలని న్యూడెమో క్రసీ నేత కామ్రేడ్ ముసలి సతీష్ డిమాండ్ చేశారు. చర్ల మండలం కలివేరు గ్రామపంచాయతీలోని లింగాల కాలనీ గ్రామంలో సిఆర్పిఎఫ్ పోలీస్ క్యాంప్ ఎదురుగా ఉన్న సందులో కరెంటు స్తంభానికి ఒక ట్రాన్ఫ్ఫురు నిర్మించారని, వెంటనే తొలగించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ చర్ల సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన కార్యక్రమం చేశారు. దీని ఉద్దేశించి చర్ల దుమ్ముగూడెం సబ్ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ ఈ ట్రాన్స్ ఫార్మర్ స్తంభానికి కింది బాగానే ఉండడంతో చిన్న పిల్లలు వృద్ధులు వికలాంగులు అనేకమంది ప్రమాదానికి గురి అయ్యే పరిస్థితి ఉంది. ఇది రహదారి కావడంతో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్న క్రమంలో అలసిపోయి పట్టుకు ంటే కరెంట్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి ఈ కింది భాగాన ఉన్నటువంటి ట్రాన్స్ఫార్మర్‌ని తొలగించి వేరే దగ్గర నిర్మించాలని, లేని యెడల అధికారులకు ఫిర్యాదు చేయవలసి వస్తుందని కోరారు. ఈ కార్యక్రమంలో పివోడబ్ల్యూ జిల్లా నాయకురాలు ఇర్ప సమ్మక్క మండల నాయకురాలు బొర్ర సమ్మక్క రామలక్ష్మి నాగమణి ఇర్ప వెంకటేష్ కణితి రమణ పాల్గొన్నారు.

## నీట్ పరీక్షపై ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి

**- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఏను రద్దు చేయాలి**

**- ఎస్ఎఫ్ఐ యలమంచిలి డివిజన్ కమిటీ**

**యలమంచిలి, జూన్ 11 (జనస్వరం) :** నీట్ యూజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలకు తావిస్తుందని ఎస్ఎఫ్ఐ యలమంచిలి డివిజన్ కమిటీ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదే సెంటర్లో ఎగ్జామ్ రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అట్టెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయని, ఆమెకు 636 మార్కులు రావాలి కానీ 720/720 ఎలా వచ్చాయంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని తెలిపారు. ఎంతో మంది విద్యార్థులకు సాధ్యం కానీ విధంగా 718, 719 మార్కులు వచ్చాయని, (+4, -1) విధానాన్ని నీట్ ఎగ్జామ్లో ఫాలో అవుతాయన్నారు. అలా చూసుకుంటే 718, 719 మార్కులు ఎలా సాధ్యమని నెట్టింట ప్రశ్నలు లేవనెత్తుతున్నాయన్నారు. ఈ నీట్ ఎగ్జామ్ వివాదంపై ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వివరణ ఇస్తూ.. పరీక్షలో సమయం కోల్పోయినట్లు నివేదించిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల 718, 719 మార్కులు వచ్చాయని, ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, అందువల్ల రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించి.. 44 మంది అభ్యర్థుల మార్కులు 715 నుంచి 720కి పెరిగాయని వివరించింది. కానీ కొంత మంది విద్యార్థులకు 100పైగా గ్రేస్ మార్కులు కలిపారు. ఇదిలా వుంటే మొదటి సారి జూన్ 14 తారీకున ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి.. ఎన్నికల కౌంటింగ్ రోజున (జూన్ 4) పరీక్షా ఫలితాలు విడుదల చేయటంతో ఎన్నో సందేహాలు లేవనెత్తాయి. అంత అవసరం ఎందుకు వచ్చిందని ఎస్ఎఫ్ఐగా ప్రశ్నిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య కేంద్రీకరణలో భాగంగా నీట్ పరీక్షను తీసుకువచ్చి విద్య ప్రైవేటీకరణ చేస్తుంది. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడిని పెంచిందన్నారు. ఇది పూర్తిగా రాష్ట్రాల హక్కులను కలరాయడమే అవుతుందని ఎస్ఎఫ్ఐ తెలుపుతుందన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నీటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందినందుకుగాను ఈ ఏజెన్సీని రద్దు చేయాలని కోరారు.

## మలేరియాపై అవగాహన ర్యాలీ..

**పాయకరావుపేట/యస్. రాయవరం, జూన్ 11 (జనస్వరం) :** ఎస్.రాయవరం, సైతరపేట గ్రామాల్లో మలేరియాపై అవగాహన ర్యాలీలు జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర ఆదేశాలు మేరకు "మలేరియా వ్యతిరేఖ మాసోత్సవాలను" పురస్కరించుకొని అవగాహన ర్యాలీలు నిర్వహించామని డాక్టర్ ఎస్ఎస్‌వి శక్తి ప్రియ, డాక్టర్ ఎన్ వాసంతి సంయుక్తంగా తెలిపారు. అందులో భాగంగా జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి పి.జె.ఎం.అర్.పి.నాయుడు సూచనలతో సర్వసిద్ధి పి.హెచ్.సి వద్ద ఎస్.రాయవరం, సైతర పేట గ్రామల్లో ఆరోగ్య విస్తరణ అధికారి టి నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ఎస్‌వి ప్రకాష్, హెల్త్ విటర్ వై.సూర్యకుమారి పర్యవేక్షణలో ఎఫ్‌డిపి క్లస్టర్ పర్యవేక్షకులు డాక్టర్ పిఎన్‌విఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులైన మలేరియా ఆడ ఎనఫిలిస్ దోమ కాటు వలన, ఫైలేరియా మరియు మెదడు వాపు క్యూలెక్స్ దోమ కాటు వలన, డెంగ్యూ మరియు చికెన్ గున్యా ఎడిస్ ఈజిప్ట్ అనే టైగర్ దోమ కాటు వలన సంక్రమిస్తుందనీ వారికి అవగాహన కల్పించి తదుపరి ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్.డి.పి క్లస్టర్ పర్యవేక్షకులు డాక్టర్ పి.ఎన్.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ఇంట్లో నిలువ వున్న నీటి పాత్రలపై మూతలు ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు, హెల్త్ సెక్రటరీలు ఆశా కార్యకర్తలు, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211 REGD NO : APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.